## క్లుప్తంగా

### రాహుల్‌గాంధీ నాయకత్వం బలపరుద్దాం

భోగాపురం: మండలంలోని గుడివాడలో 'చేయి చేయి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం' కార్యక్రమం డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, ఎస్.సూరిబాబు, రమణ, అప్పలరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### యువకులకు ఉపాధిపై శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కలిగించేందుకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి జీబీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు హౌస్ వైరింగ్, టైలరింగ్, ఇన్‌స్టలేషన్ ఆఫ్ సీసీ టీవీ, కెమెరా కోర్సులపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. తెలుపు రంగు రేషన్‌కార్డు కలిగి 45 సంవత్సరాల్లోపున్న గ్రామీణ ప్రాంత పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల పదో తేదీలోగా దరఖాస్తులను కార్యాలయానికి పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు 99595 21662, 99857 87820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఆప్టోమెట్రీ కోర్సుకు మంచి డిమాండ్ ఉందని.. పూర్వ విద్యార్థులు ఆప్టోమెట్రీ విభాగంలో ఉన్నత స్థాయిలో స్థిరపడడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వేత్త రమేష్‌కుమార్

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఆధ్యాత్మికవేత్త బి.రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక షిర్డీసాయి ఆలయం ప్రాంగణంలో విద్యార్థులకు ఆధ్యాత్మిక పాఠాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారం రోజుల పాటు వేదాలు, రామాయణ, మహాభారతంపై విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంపా ఉషా, బూరాడ సుశీల, బాలాజీ మాష్టారు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ముత్యాలమ్మ సప్తమ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి సప్తమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

### మరిడిమాంబ పండుగ ప్రారంభం



అమ్మవారి ఘటాలను తీసుకొస్తున్న మహిళలు

శృంగవరపుకోట: సీతారాంపురం గ్రామంలో గ్రామదేవత మరిడిమాంబ పండుగ గురువారం సాయంత్రం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను డప్పులు, బాణసంచా మోతల మధ్య ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు ఇచ్చి, చీర, సారెలు పెట్టి, మొక్కులు చెల్లించారు.

# పాలనపై ప్రజాస్పందన అనూహ్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- చురుగ్గా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాలు



విజయనగరం: ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రజా స్పందన అనూహ్యంగా వస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలనపై ప్రజా స్పందన అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేయడంతో మంత్రి, తదితరులు ఆనందపడ్డారు. అనంతరం ఒక్కో ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ స్పీకర్ కోలగట్లను గజమాలతో సత్కరించారు. అనంతరం జోనల్ ఇన్‌ఛార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలో రూ. 2 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి, ప్రజల దాహార్తిని తీర్చే బృహత్తర కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శ్రీకారం చుట్టారన్నారు. అమ్మఒడి, ఆసరా, పింఛన్లు, వసతిదీవెన, సున్నా వడ్డీ, తదితర అనేక సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతుండడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు సువ్వాడ జయరాం, తదితరులు పాల్గొన్నారు.

### గుంకలాంలో 'గడప గడపకు...'

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రభుత్వ పథకాల మంజూరు, అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై గడప గడపకూ వెళ్లి లబ్ధిదారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తుంటే.. విజయనగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. గుంకలాం గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా మంజూరయ్యేలా కృషి చేస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.నారాయణ, సర్పంచ్ కునుకు వెంకటరావు, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉప సభాపతి కోలగట్ల

# అమ్మ దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన పైడితల్లి అమ్మవారు దేవర మహోత్సవం తర్వాత చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆ చల్లని తల్లి కరుణా, కటాక్షాల కోసం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. మహిళలు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పుష్పాలంకరణలో అమ్మవారు భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

### గడువు లోగా 'నాడు - నేడు' పనులు



పనులపై ఆరాతీస్తున్న ఎంఈఓ కృష్ణారావు

నెల్లిమర్ల: నగర పంచాయతీతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మన బడి–నాడు నేడు పనులను గడువులోగా పూర్తి చేయాలని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, ఏఈఓ శ్రీరాములనాయుడు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ, పాఠశాలలను పునఃప్రారంభించే సమయానికి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

# సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు సక్రమంగా సేవలందుతాయని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుకొండపాలెం గ్రామ సర్పంచ్ బోని కృష్ణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అయితే సచివాలయ సిబ్బంది అలసత్వంతో ప్రజలకు సకాలంలో సేవలందడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని పడాలపేట సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిన ప్రజాప్రతినిధులకు ముందుగా తెలియపరచాలని ఎంపీపీ ఆదేశించారు. అనంతరరం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, మండల శాఖ అధికారులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం: ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ క్యాలెండర్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకాలు అందిస్తామో క్యాలెండర్ రూపొందించిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షోభాలెన్ని ఉన్నా చెప్పిన సమయానికి పథకాలు అందించడం జగన్ మోహన్‌రెడ్డికి తప్ప మరెవ్వరికీ సాధ్యం కాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల్లో 98.44 శాతం నెరవేర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, ఏవీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# భూమి రికార్డులను ఆన్‌లైన్ చేయాలి

- నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్



సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: జగనన్న శాశ్వత – భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న రీ సర్వేకు సంబంధించిన రికార్డులను త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పట్టణ పరిధిలోని 2వ వార్డు సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్యదర్శులంతా సమయపాలన పాటించడంతో పాటు యూనిఫారం తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను నిర్ణీత గడువులోగా అందించాలని సూచించారు. కార్యదర్శులపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.

### ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు

గంట్యాడ: విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు క్షేత్ర సహాయకులకు మెమోలు జారీ చేసినట్టు ఏపీఓ ఆదిలక్ష్మి తెలిపారు. జాబ్ కార్డు అడిగిన ఇవ్వకపోవడం, తక్కువ మందితో పని చేయించడం, సక్రమంగా పని చేయించకపోవడం తదితర కారణాలతో మెమోలు ఇచ్చినట్టు చెప్పారు. పెదమజ్జిపాలెం, జగ్గాపురం, పెదవేమలి, వసంత క్షేత్ర సహాయకులకు మెమోలు జారీ చేశారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

- ఎంపీపీ హైమావతి

గంట్యాడ: తాగునీటి సమస్య పరిష్కారానికి క్రాస్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్యం, ఉపాధిహామీ, వెలుగు, గృహనిర్మాణం, ఐసీడీఎస్, విద్యుత్, పశు సంవర్ధకశాఖ, ఇరిగేషన్ శాఖలపై సమీక్షించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మే నెలఖారు నాటికి విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో నిల్వ చేస్తామని ఏఓ బి.శ్యామ్‌కుమార్ తెలిపారు. క్రాస్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో పాడైన బోర్లు బాగు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీల్‌కుమార్ వివరించారు. కళాశాల తెరిచే నాటికి నాడు–నేడు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నోట్ పుస్తకాలు పూర్తి స్థాయిలో వచ్చేసాయని, కొన్ని తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ విజయలక్ష్మి చెప్పారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారుల ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఏపీఓ ఆదిలక్ష్మి తెలిపారు. ఉపాధి మస్టర్ల నమోదులో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, గ్రామాలకు వెళ్లే ముందు స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సమాచారం అందించాలన్నారు. తీర్మానాల పేరుతో బుక్ కీపర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, దానిపై విచారణ చేపట్టాని వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌ను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన శ్రీనివాసరాజు



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న కాకర్లపూడి శ్రీనివాసరాజు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాకర్లపూడి శ్రీనివాసరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయనగరం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రిని ఎ.రావివలస వద్ద శ్రీనివాసరాజు కలిసి జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

# అన్నమయ్య జయంతి వేడుకలకు సర్వం సిద్ధం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, తదితరులు

- భక్తుల సందర్శనార్థం 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు తెలిపారు. ఈ మేరకు కళాపీఠం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఆ రోజు సాయంత్రం నిర్వహించే కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. భక్తుల సందర్శనార్థం అక్షయ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఏగిరెడ్డి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో 12 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్నమాచార్యుల సంకీర్తనామృతంతో ప్రారంభం కానున్న కార్యక్రమంలో భగవతి నృత్యకళామందిర్ రమణకుమారి బృందంతో 'అన్నమయ్య జననం' నృత్యరూపకాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. సంస్థ అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.ఉమాశంకర్, సహాయ కార్యదర్శి బి.సూర్యనారాయణ, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ (అబ్బులు), సభ్యులు మమత, స్వర్ణ, ప్రసాదరావు, సుధ, త్రిషిత, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ధర్మం ఉన్నతమైనది..



విశ్రాంత ఏఈ వర్మరాజును సత్కరిస్తున్న ఉప సభాపతి కోలగట్ల, తదితరులు

విజయనగరం రూరల్: ఉద్యోగ నిర్వహణలో ప్రజలకు సేవలందించే భాగ్యం కలుగుతుందని, ఉద్యోగ ధర్మం ఎంతో ఉన్నతమైనదని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గృహనిర్మాణశాఖ మండల అసిస్టెంట్ ఇంజినీర్ వర్మరాజు గత నెల 30న పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో గుంకలాం గురువారం ఆయన్ని కోలగట్ల సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

గంట్యాడ: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శతశాతం విజయవంతం అయిందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. గురువారం ఆమె ఛాంబర్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించేందుకు ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అయితే కొంతమంది అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు వస్తున్నాయన్నారు. వారు తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సెట్విజ్ సీఈఓ రాజగోపాల్ అన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, వాలీబాల్ విభాగాల్లో మే 1 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజూ ఉదయం 6 గంటలు నుంచి 8 గంటలు వరకు సాయంత్రం 4 గంటలు నుంచి 6 గంటలు వరకు శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, కొసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ స్వరూప్, కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.